ప్రజాశక్తి

శనివారం 7 అక్టోబర్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఉరుకులు.. పరుగులు

- ఇకెవైసికి ముగియనున్న గడువు
- ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఈ - పంట (ఎలక్ట్రానిక్ క్రాప్) నమోదులోవున్న ప్రగతి ఇకెవైసిలో లేదు. ఈ - క్రాప్ చేసుకున్న రైతులకు ఇకెవైసి చేయించేందుకు వ్యవసాయశాఖ ఉరుకులు, పరుగులు పెడుతోంది. ఇకెవైసి గడువు ఈ నెల 8 వరకూ ఉంది. సమయం సమీపించడంతో గ్రామ వ్యవసాయ సహాయకులు, సిబ్బంది గ్రామాలు వెళ్తున్నారు. 1,70,581 మంది రైతులు తమ పంటలకు ఈ - క్రాప్ చేసుకోగా వీరిలో 96,282 మంది రైతులు మాత్రమే ఇకెవైసి చేసుకున్నారు.

జిల్లాలో ఖరీఫ్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించి 3,07,382 ఎకరాల సాధారణ విస్తీర్ణానికిగానూ 2,43,017 ఎకరాల్లో పంటలు



నమోదయ్యాయి. వీటిలో 1,70,581 మంది రైతులకు చెందిన 2,39,090 ఎకరాలు (98 శాతం) ఈ - క్రాప్ అయింది. ఈ - క్రాప్ చేసుకున్న 1,70,581 మంది రైతుల్లో 96,282 మంది రైతులకు చెందిన 1,32,852 ఎకరాలకు ఇకెవైసి (60 శాతం) పూర్తయింది. మిగిలిన 74,299 మంది రైతులు ఇకెవైసి చేసుకునేందుకు ఒక్కరోజే గడువు వుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ - క్రాప్ నమోదైనా.. ఇకెవైసి కాకపోతే ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రోత్సాహకాలు, రాయితీలు, నష్టపరిహారం వంటివి రైతులకు అందే అవకాశంలేదు. సర్వర్ సరిగా పనిచేయకపోవడంతో ఇకెవైసి కావడంలేదు. దీంతో అర్ధరాత్రి వరకూ వ్యవసాయశాఖ సిబ్బంది పనిచేయాల్సివస్తోంది. ఈ - క్రాప్ నమోదు గడువు సెప్టెంబరు 30 నుంచి అక్టోబర్ 8 వరకు పెంచినా సర్వర్ సమస్యతో ఇకెవైసి సరిగా కావడంలేదు. రైతుల పంటలకు సంబంధించి ఫేషియల్, ఒటిపి, వేలిముద్ర ద్వారా ఆధార్, ఫోన్ నెంబర్, బ్యాంకు అకౌంట్‌కు అనుసంధానం చేసుకోవాల్సివుంది. ఈ - క్రాప్ అయినా ఇకెవైసి చేసుకోని రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సాయం అందకుండాపోనుంది.

ప్రగతి దిశగా.. వైజాగ్ పోర్టు

- నేడు 90వ ఆవిర్భావ దినోత్సవం
- 1933 అక్టోబర్ 7న తొలి నౌక సరుకు రవాణా
- రూ.వందల కోట్లతో బెర్తుల అభివృద్ధి

పజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో



వైజాగ్ పోర్టులో అధునాతన నిర్మాణాలు

వైజాగ్ పోర్టు ప్రగతి దిశగా సాగుతోంది. మౌలిక వసతుల అభివృద్ధి, అధునాతన పద్ధతులతో ఈ పోర్టు ప్రయివేటు పోర్టులకు సవాలు విసురుతోంది. దేశంలో ఎంతో విశిష్టమైనదిగా పేరొందిన ఈ పోర్టు నేడు ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటోంది. ఈ పోర్టు ప్రస్థానాన్ని ఓసారి పరికించి చూస్తే.. దీని నిర్మాణం 1927లో ప్రారంభమైంది. 1933 అక్టోబర్ 7న పోర్టు నుంచి తొలి నౌక సరుకు రవాణా ప్రారంభమైంది. సింధియా స్టీమ్ నావిగేషన్ కంపెనీ తొలి పాసింజర్ నౌక ఎస్ఎస్ జలదుర్గను విశాఖపట్నం పోర్టుకు తీసుకువచ్చింది. అప్పటి వైస్రాయ్, గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా లార్డ్ విల్లింగ్టన్ నౌకాశ్రయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. వైజాగ్ హార్బర్‌ను అతి సుందరంగా తీర్చిదిద్దడంలో ఇంజినీర్లు డబ్ల్యూసి యాష్, ఓబి రాటెన్‌బరీలు కీలకపాత్ర పోషించినట్లుగా పోర్టు ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇంతింతై వటుడింతై అన్న మాదిరిగా అంచెలంచెలుగా సరుకు రవాణా, సముద్ర వ్యాపారంలో అగ్రగామిగా నిలుస్తూ విశాఖకు 'పోర్టు సిటీ' నామకరణం దక్కేలా ఈ పోర్టు చేసింది. విశాలమైన హింటర్ ల్యాండ్, పోర్టు దగ్గర్లోనే స్టీల్‌ప్లాంట్, సెయిల్, ఎన్‌టిపిసి, నాల్కో, ఎన్ఎండిసి, ఎంఎంటిసి, షిప్‌యార్డు, కోరమండల్, ఆర్‌సిఎల్, హెచ్‌పిసిఎల్ వంటి భారీ పరిశ్రమలు ఉండడం పోర్టు సరుకు రవాణాకు పెద్ద భరోసా.

పోర్టుకు కీలకం స్టీల్‌ప్లాంటే!

వైజాగ్ పోర్టుకు ప్రధానంగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఎగుమతి, దిగుమతులే కీలకం. మైనింగ్, పెట్రోలియం, ఎరువుల రవాణాను పోర్టు ప్రధానంగా నిర్వహిస్తోంది. దీంతో పాటు దేశంలోనే అత్యంత లోతైన కంటైనర్ టర్మినల్‌ను మిగతా 2లో..

స్థాయీ సంఘంలో 23 అంశాలు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి స్థాయీ సంఘ సమావేశం శుక్రవారం స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశ మందిరంలో జరిగింది. స్థాయీ సంఘం అజెండాలో 10 అంశాలతో పాటు 13 టేబుల్ అజెండాలలో పలు అంశాలను పొందుపరచగా మొత్తంగా 23 అంశాలను స్థాయి సంఘం సభ్యులు ఆమోదించారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ.102.47 లక్షల పనులకు, ప్రజారోగ్య మిగతా 2లో..

రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

వార్త మెయిన్‌లో..

జూ పార్కులో యువ మృగరాజు

వార్త 3లో..

పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలి

వార్త 3లో..

న్యూస్ క్లిక్‌పై దాడిని ఖండిస్తూ..

జర్నలిస్టుల నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్వతంత్ర ఆన్‌లైన్ పోర్టల్ న్యూస్ క్లిక్‌పై మోడీ సర్కారు ఉక్కుపాదం మోపడాన్ని ఖండిస్తూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్), ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు విశాఖ నగరంలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. మీడియా స్వేచ్ఛపై దాడి సిగ్గు సిగ్గు, జర్నలిస్టుల గొంతు నొక్కడం దుర్మార్గం, న్యూస్ క్లిక్‌పై దాడి మీడియా స్వేచ్ఛకు భంగం అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ మీడియా స్వేచ్ఛను అరికట్టడం ప్రజాస్వామ్యంలో తగదని అన్నారు. ఢిల్లీలో న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ సహా మరికొంతమంది జర్నలిస్టులను అరెస్టు చేయడం సరికాదన్నారు. ఇది మీడియా స్వేచ్ఛను హరించినట్లు అవుతుందన్నారు. మీడియాలో ప్రతికూల వార్తలు వచ్చిన సందర్భంలో ఇతర మార్గాల ద్వారా తమ అసంతృప్తిని తెలియజేయవచ్చని అన్నారు. ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్షులు పోతుమహంతి నారాయణ్ మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛలో మిగతా 2లో..



నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, మద్దతుగా నినాదాలు చేస్తున్న సిపిఎం నాయకులు లోకనాథం, తదితరులు

పలుచోట్ల కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో డిసిపి - 1 కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. మారికవలస, కొబ్బరి తోట, సాలిపేట ప్రాంతాలలో ఒకే సమయంలో ఈ సెర్చ్ చేపట్టారు. ఆయా ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 31 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలూ జరగకుండా ఏకకాలంలో చేపట్టిన ఈ కార్డన్ సెర్చ్‌లో 150 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారులకు జిపిఎస్‌తో మేలు

వార్త 2లో..

మొదటి పేజీ తరువాయి..



తొలి సరుకు రవాణా నౌక జలదుర్గ (ఫైల్‌ఫొటో)

ప్రగతి దిశగా.. వైజాగ్ పోర్టు

కలిగి ఉంది. పదేళ్లుగా దేశ వాణిజ్యంలో, ఆర్థిక ప్రగతిలో పోర్టు కీలక భూమిక నిర్వహిస్తోంది. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ జరిగితే పోర్టు కార్యకలాపాలపైనా ఆ ప్రభావం పడనుంది.

మౌలిక వసతుల అభివృద్ధిలో భేష్

మౌలిక వసతుల అభివృద్ధి కోసం పోర్టు యాజమాన్యం, కార్మికులు, ఉద్యోగులు మూకుమ్మడిగా తొలి నుంచీ శ్రమిస్తూ ప్రపంచ స్థాయిలో పోర్టును నిలబెట్టారు. తాజాగా ట్రక్ పార్కింగ్ టర్మినల్ (టిపిటి)ను పోర్టు అభివృద్ధి చేసింది. 666 వాహనాల పార్కింగ్ సామర్థ్యంగల ప్రాంగణమిది. 84 వేల టన్నుల సరుకును నిల్వ వుంచే విధంగా కవర్డ్ స్టోరేజ్ షెడ్ల నిర్మాణాన్ని పూర్తిచేసుకుని 'ఎకో పోర్టు'గా ఇది గుర్తింపు పొందింది.

రూ.655 కోట్లతో యాంత్రీకరణ

కేంద్ర ప్రభుత్వ విధానం ప్రకారం పోర్టులోని కార్యకలాపాలన్నిటినీ పిపిపి మోడ్‌లో యాంత్రీకరణ చేసేందుకు కొన్నాళ్లుగా ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. రూ.655 కోట్లతో ఈక్యూ-7, వెస్ట్ క్యూ -7, 8 బెర్తులను యాంత్రీకరించే పనులు పిపిపి పద్ధతిలో చేపట్టేందుకు నిర్ణయించింది. రూ.600 కోట్ల విలువైన రెండు ప్రధాన ప్రాజెక్టులను పిపిపిలో ఈ ఏడాదికి కాంట్రాక్టర్లకు అప్పగించే ఏర్పాటు చేసింది. రూ.800 కోట్లతో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్, సిఎన్‌జి బంకరింగ్ స్టేషన్‌ను నెలకొల్పేందుకు వైజాగ్ పోర్టు హెచ్‌పిసిఎల్, ఐఒసిఎల్‌తో పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. విపిటి 10 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను ఇప్పటికే నిర్వహిస్తోంది. పోర్టుకు అవసరమైన విద్యుత్ మొత్తాన్ని సొంతంగా ఉత్పత్తి చేసుకుంటోంది. రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం ద్వారా 190 కిలోవాట్ల విద్యుత్‌ను అదనంగా ఉత్పత్తి చేస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగానూ 20 మెగావాట్ల ఉత్పత్తి లక్ష్యంగా సాగుతోంది.

అందుబాటులోకి విసిటిపిఎల్

విసిటిపిఎల్ ప్రస్తుతం అందుబాటులోకి వచ్చింది. క్రూయిజ్ టూరిజం అభివృద్ధికి ఈ టర్మినల్ నిర్మాణం ఎంతగానో ఉపయోగపడనుంది. కేంద్ర పర్యాటక శాఖ, ఎపి ప్రభుత్వం, పర్యాటక వాటర్‌స్పోర్ట్స్ అభివృద్ధిని చేపట్టి భవిష్యత్తులో శ్రీలంకను కలుపుకుంటూ బుద్ధిస్ట్ టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేసే దిశగా పోర్టు ప్రయత్నాలు చేపట్టింది. విశాఖ కంటైనర్ టర్మినల్ 845 మీటర్ల పొడవు, 16 మీటర్ల సహజసిద్ధమైన లోతును కలిగి విసిటిపిఎల్ ట్రాఫిక్‌కు ముఖద్వారంగా ఉంది. ఎపి, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, జార్ఖండ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు ఇది 'గేట్ వే' మాదిరిగా తయారైంది. విసిటిపిఎల్ ఈ ఏడాది ఇప్పటికే 38 శాతం వృద్ధిని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం 2.48 లక్షల టిఇయుల కంటైనర్లను ఎగుమతి చేయగా ఈ ఏడాది 3.4 లక్షల టిఇయుల కంటైనర్లను చేసింది. ఎపి మారిటైం, ఎస్ఐటిసి అనే రెండు కంటైనర్ లైనర్లు ఈ ఏడాది నుంచి ఈ టర్మినల్ ద్వారా పనులను ప్రారంభించడం విశేషం. కొల్‌కతా, హాల్దియా, పారాదీప్, కాకినాడ, చిట్టాగాంగ్, యాంగన్ పోర్టులకు విసిటిపిఎల్ ట్రాన్షిప్‌మెంట్ హబ్ లా మారింది.

స్థాయీ సంఘంలో 23 అంశాలు ఆమోదం

విభాగానికి సంబంధించి మూడో జోన్ నుంచి కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌కు రెండు టిప్పర్ల ద్వారా వ్యర్థాలను తరలించేందుకు 30 రోజులకు రూ.4.80 లక్షలు చెల్లించేందుకు, జి - 20 సదస్సులో స్వచ్ఛ సర్వేక్షణ్ కోసం అదనంగా వంద మంది పారిశుధ్య కార్మికులు నెల రోజుల పాటు విధులు నిర్వహించినందుకు రూ.15 లక్షలు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన కోసం విధులు నిర్వహించేందుకుగాను 36 మంది వాలంటీర్లకు మూడు నెలల కాల పరిమితికి రూ.10.80 లక్షలు ఖర్చు చేసేందుకు స్థాయి సంఘం ఆమోదం తెలిపిందన్నారు. రెవెన్యూ విభాగానికి చెందిన లీజులు పొడిగింపులు, ఉద్యోగుల ప్రొబేషన్, సర్వీస్ క్రమబద్ధీకరణకు సంబంధించిన అంశాలతో పాటు ఇతర అంశాలను సభ్యులు ఆమోదించినట్టు ఛైర్‌పర్సన్ తెలిపారు. సమావేశంలో స్థాయీ సంఘ సభ్యులతో పాటు ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, కార్యదర్శి పి.నల్లనయ్య పాల్గొన్నారు

జర్నలిస్టుల నిరసన

దేశం స్థానం 16కి పడిపోవడం పత్రికల దుస్థితిని తెలియజేస్తోందన్నారు. పాత్రికేయుల పట్ల సమాజం సానుకూలంగా ఉండాలని అన్నారు. జిల్లా నాయకులు ఎన్.మధుసూదనరావు మాట్లాడుతూ న్యూస్ క్లిక్‌పై దాడిని ఖండించారు. జర్నలిస్టుల ఇళ్లపై దాడులు చేసి ల్యాప్‌టాప్స్, మొబైల్ ఫోన్లను పోలీసులు లాక్కోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమానికి మద్దతు తెలుపుతూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ న్యూస్‌క్లిక్‌పై బిజెపి ప్రభుత్వం అసత్య ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. ఉపా చట్టం కింద నేరపూరిత కుట్రలకు పాల్పడుతూ పలు కేసులు పెట్టడం గర్హనీయమన్నారు. ప్రభుత్వానికి ఇష్టం లేని వార్తలు ప్రసారం చేస్తున్నందునే ప్రముఖ పాత్రికేయుడు, రచయిత ప్రబీర్ పుర్కాయస్థ నేతృత్వంలో నడుస్తున్న ఆ పోర్టల్‌పై ఆరోపణలు చేస్తూ అక్రమ కేసులతో వేధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. మోడీ ప్రభుత్వ నిరంకుశ విధానాలు, మీడియాపై దాడులు, వేధింపుల వల్ల ఇప్పటికే దేశం ప్రపంచ పత్రికా స్వాతంత్ర్యంలో అట్టడుగు స్థాయికి చేరిందని గుర్తు చేశారు. జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.రవికుమార్, ఎపిబిజెఎ జిల్లా అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, ఫెడరేషన్ జిల్లా నాయకులు కోడూరు అప్పలనాయుడు, జి.శ్రీనివాస్, బొప్పన రమేష్, బి.సీతారామమూర్తి, వై.రామకృష్ణ, కృష్ణమూర్తి నాయుడు, నగేష్, కె.రాజేష్, ఆడారి కొండలరావు, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. సంఘీభావం తెలిపిన వారిలో సిపిఎం నేతలు ఆర్‌కెఎస్‌వి.కుమార్, కృష్ణారావు ఉన్నారు.

మత్స్యకారులకు జిపిఎస్‌తో మేలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా మంజూరైన గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జిపిఎస్)ను శుక్రవారం విశాఖ లాసన్స్ బే కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో మత్స్యకారులకు ఎంపీ ఎంవివి.సత్యనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లే సమయంలో ఈ సిస్టమ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కొత్త జాలరి పేట, పెద్ద జాలరి పేట, జాలరి ఎండాడ, వాసవానిపాలెం, మూలపాలెం గ్రామాలకు గానూ ఒక్కొక్క గ్రామానికీ ముగ్గురు చొప్పున 15 యూనిట్లు పంపిణీ చేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు జి.విజయ, సహాయ సంచాలకులు విజయ్‌కృష్ణ, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి మురళి, అప్పలరాజు, గురుమూర్తి పాల్గొన్నారు.


జిపిఎస్ యూనిట్లను అందజేస్తున్న ఎంపీ ఎంవివి.సత్యనారాయణ

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం వినతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అక్రిడేటెడ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్‌కు విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు వినతిపత్రం అందజేశారు. విశాఖలో శుక్రవారం సాయంత్రం అమర్‌ను కార్యవర్గ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా సొసైటీ గౌరవాధ్యక్షులు కెజి.రాఘవేందర్ రెడ్డి, అధ్యక్షులు బి.రవికాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ మ్యానిఫెస్టోలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల అంశం ఉందని గుర్తుచేశారు. విశాఖలో హౌసింగ్ సొసైటీ ఏర్పాటు చేశామని, సుమారు 800 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. అందరికీ న్యాయం చేసేలా చొరవ చూపాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన అమర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్తానన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయమై కచ్చితంగా మేలు జరుగుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇండియన్ జర్నలిస్ట్ అసోసియేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఆర్.రామ చంద్రరావు, హౌసింగ్ సొసైటీ సలహాదారు డి.రవి కుమార్, ఉపాధ్యక్షులు కోయిలాడ పరశురాం, పి.రామకృష్ణ, మురళీకృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన రమేష్, సహాయ కార్యదర్శులు అనురాధ, బందరు శివప్రసాద్, జర్నలిస్టులు శ్రీహరి, చందు, ఎస్‌విబి.కుమార్, సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.


అమర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సొసైటీ నాయకులు

బిజెపి తీరుపై కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జోడో యాత్రలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీకి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూడలేకే బిజెపి అభ్యంతరకర పోస్టర్‌ను విడుదల చేసిందని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవిందరాజు ఆరోపించారు. బిజెపి తన ట్విటర్ అకౌంట్‌లో రాహుల్ గాంధీని నవయుగ రావణుడిగా అభివర్ణిస్తూ పోస్టర్ విడుదల చేసి రావణ అని క్యాప్షన్ జోడించడాన్ని నిరసిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి వజ్జిపర్తి శ్రీనివాసరావు, సభ్యులు వైఎస్.జగన్నాథరావు (జగన్), ఎఐసిసి మెంబర్ వేగి వెంకటేష్, లక్కరాజు రామారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి తన శక్తి మేరకు కృషి చేస్తానని జనసేన నియోజకవర్గ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు అన్నారు. పవనన్న ప్రజా బాట కార్యక్రమంలో భాగంగా ఆయన 39వ వార్డు ఫెర్రీ వీధిలో లక్ష్మి అనే అమ్మాయికి పట్టు బట్టలు, వెండి పట్టీలు అందజేశారు. అలాగే ఆ ప్రాంతంలో పర్యటించి పలువురు విభిన్న ప్రతిభావంతులను కలుసుకున్నారు.

సిపిని కలిసిన కోలా గురువులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగర పోలీసు కమిషనర్ డాక్టర్ ఎ.రవి శంకర్ అయ్యనార్‌ను వైసిపి జిల్లా అధ్యక్షులు, డిసిసిబి ఛైర్మన్ కోలా గురువులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. అనంతరం నగరంలో శాంతి భద్రతల తీరును వివరించారు.

జూలో యువ మృగరాజు

-సందర్శనార్థం డే క్రాల్‌లోకి విడుదల

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ ఇందిరాగాంధీ జూపార్కు జంతు కుటుంబంలోకి మరో ప్రత్యేక అతిథి చేరింది. గుజరాత్‌లోని సక్కర్ బాగ్ జంతుప్రదర్శన శాల నుంచి కొన్ని నెలల క్రితం తీసుకొచ్చిన ఆడ సింహాన్ని దాని క్వారంటైన్ సమయం అనంతరం జూ పర్యాటకుల సందర్శనార్థం ప్రత్యేక ఎన్‌క్లోజర్‌లోకి శుక్రవారం విడుదల చేశారు. చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీకంఠనాథరెడ్డి, జూ క్యూరేటర్ నందని సలారియా జెండా ఊపి మృగరాజును డే క్రాల్‌లోకి విడుదల చేశారు. సుమారు 2.5 సంవత్సరాల ఈ యువ ఆడ సింహం సందర్శకులను అలరించబోతున్నట్లు తెలిపారు. విద్యార్థులు వన్యప్రాణుల చరిత్ర తెలుసుకొనేందుకు ఈ కొత్త జంతువు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కన్జర్వేటర్ మంగమ్మ, జూ సిబ్బంది, వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



సందర్శనార్థం డ్రే కాల్‌లోకి విడుదల చేసిన సింహం

పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి -ఆనందపురం : విద్యార్థి దశ నుంచే పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలని ఇస్రో శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఆనందపురం మండలం నేలతెరులో కస్తూర్బా గాంధీ పాఠశాలను రఘు ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఇస్రో స్పేస్ వే గ్రూప్ కో-ఆర్డినేటర్‌గా ఉన్న శాస్త్రవేత్తలు పి.సాయికృష్ణ కౌశిక్, జి.అప్పన్న, రామాంజనేయులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నేటి విద్యార్థులు భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలు కావాలన్నారు. అబ్దుల్ కలాం, కల్పనాచావ్లా వంటి శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకొని ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్రకళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి శివాజీనగర్ -2లో శుక్రవారం సీజనల్ వ్యాధులపై వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, జోన్ -2 కమిషనర్ కనక మహాలక్ష్మి ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్, కార్పొరేటర్ మాట్లాడుతూ, ఇంట్లో తడి, పొడి చెత్తను వేరు చేసి జివిఎంసి వాహనాలకు అందించాలని, డ్రై డే విధిగా పాటించాలని, నీటి ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూడాలని స్థానికులను కోరారు. ప్లాస్టిక్ నివారణకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ మంగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



ర్యాలీ అగ్రభాగంలో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, కార్పొరేటర్ సునీత

శస్త్ర చికిత్స నైపుణ్యాలపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : శస్త్ర చికిత్స నైపుణ్యాలపై స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్‌లో శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్ వంశీకృష్ణారెడ్డి, ఎన్ఆర్ఐఐఎంఎస్ డీన్ డాక్టర్ సుధాకర్, వైద్యులు ప్రభు, అరుణ్‌కుమార్, తిరు నీలకందన్, పి.సురేష్‌కుమార్, ప్రదీప్ దేవదాస్ తదితరులు పాల్గొన్నారు. ఎన్ఆర్ఐఐఎంఎస్, ఓరల్ అండ్ మాక్సిల్లో ఫేషియల్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు జరుగనున్న వర్క్ షాప్‌లో పలు అంశాలపై అవగాహన కల్పించారు.



వర్క్ షాప్‌నకు హాజరైన వైద్యులు

సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -సీతమ్మధార : అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న ప్రజలందరూ సిసి కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని నాలుగో పట్టణ లా అండ్ ఆర్డర్ సిఐ ఎస్.విజయ్‌కుమార్ సూచించారు. నందగిరినగర్‌లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిసి కెమెరాలు ఏర్పాటు వల్ల దొంగతనాలు, అల్లర్లకు పాల్పడిన వారిని గుర్తించవచ్చని, మిమ్మల్ని మీరే రక్షించుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పోలీసులు పాల్గొన్నారు.

పాండురంగలో వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని పాండురంగ సచివాలయ ప్రాంగణంలో రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. మూడేళ్ల క్రితం ఈ వెల్‌నెస్ సెంటర్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎట్టకేలకు నిర్మాణం పూర్తిచేశారు. ఈ సచివాలయ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. సేవలందించిన వైద్యులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.రాంబాబు, మండల వైసిపి అధ్యక్షులు కె.లక్ష్మణరావు, ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్, రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించిన ఎపి మీడియా అడ్వైజర్

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను శుక్రవారం ఎపి మీడియా అడ్వైజర్ దేవులపల్లి అమర్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఎఇఒ డి.భ్రమరాంబ స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. వారిని ఎఇఒ భ్రమరాంబ సాలువతో సత్కరించి, స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందించారు.

విజ్ఞాన విహార్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఆనందపురం : విద్యాభారతి అఖిల భారత స్థాయి పోటీలలో గుడిలోవ విజ్ఞాన విహార్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మధ్యప్రదేశ్ ఉజ్జయినిలో జరిగిన ఖేల్‌కూద్ కార్యక్రమంలో విజ్ఞానవిహార ఆవాస విద్యాలయం, గుడిలోవ పాఠశాల నుంచి ఏడుగురు విద్యార్థులు ఎస్‌జిఎఫ్ పోటీలకు ఎంపికయ్యారు. రోషన్, కిరణ్ తేజ, విష్ణువర్ధన్, చైతన్య, రోహిత్, కృష్ణకాంత్, పవిత్ర, ఎ.లక్ష్మినీల ఎంపికయ్యారు. అఖిల భారతస్థాయి బాక్సింగ్ పోటీలలో యోగితా కుమారి రజత పతకం, వరలక్ష్మి కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్, శైక్షణిక ప్రముఖ్, అధ్యక్షులు, కార్యదర్శి అభినందించినారు.

భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి -ఆనందపురం : ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని నార్త్ ట్రాఫిక్ సర్కిల్ సిఐ వెంకట్రావు పేర్కొన్నారు. శుక్రవారం ఆనందపురం మండలం బోయపాలెం, వేములవలస మార్కెట్, వేములవలస జంక్షన్, ఓల్డ్ బస్ స్టాండ్, భీమిలి క్రాస్ రోడ్డు, ఆటో స్టాండ్‌ల ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆటోలో ఫ్రంట్ సిట్టింగ్ కూర్చో పెట్టకూడదని, విధిగా యూనిఫామ్ ధరించాలని, తాగి వాహనం నడపవద్దని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ రఘురామ్, సిబ్బంది, 45 మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పిఎం.పాలెంలో చోరీ

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టపగలు శుక్రవారం ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. నేర విభాగపు ఇన్‌ఛార్జి సిఐ, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... పోతిన మల్లయపాలెం ఆచ్‌హెచ్ కాలనీలో కె. ధనుంజయరావు, భార్య, ఇద్దరు కుమార్తెలతో ప్లాట్ నెంబర్ 7-23లో నివాసముంటున్నారు. ధనుంజయరావు భార్య స్వర్ణలతకు అనారోగ్యం కారణంగా గత నెల 30న నగరంలోని హాస్పిటల్‌లో చేర్పించారు. కుమార్తెలు జోష్న, వేణుమాధవిని బంధువుల ఇంట్లో ఉంచారు. ధనుంజయరావు రోజూ ఇంటికివచ్చి తిరిగి ఆసుపత్రికి వెళ్లేవాడు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని సమీపంలోనే ఉన్న బంధువు చూసి వెంటనే ధనుంజయరావుకు సమాచారం అందించారు. ధనుంజయరావు పిఎం.పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నేర విభాగపు డిజిపి నాగన్న సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో పరిసరాలను పరిశీలించారు. ఈ చోరీలో బంగారు హారం, నక్లేసు, గాజులు ఉంగరం, చెవి రింగులు తదితర సుమారు 20 తులాల బంగారం చోరీకి గురైనట్లు బాధిత కుటుంబీకులు తెలిపారు. పిఎం.పాలెం నేరవిభాగం ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేపట్టారు.

పోలీసులపై దాడి చేసిన ఆర్మీ ఉద్యోగి అరెస్ట్

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఎస్ఐ, ఎఎస్ఐ, ఇద్దరు పోలీసు సిబ్బందిపై దాడి చేసి గాయపరచిన ఒక ఆర్మీ ఉద్యోగిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్టు కొత్తకోట సిఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ శుక్రవారం సాయంత్రం తెలిపారు. వివరాలివి. మేడివాడ గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి గొర్లె భాస్కరరావుకు అదే గ్రామానికి చెందిన పతివాడ కోటేశ్వరరావు సరిహద్దు భూవివాదాలున్నా యి. పలుమార్లు గొడవ పడటంతో తహసీల్దార్ కోర్టులో బైండోవర్ చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల 5 భాస్కరరావు కత్తితో కోటేశ్వరరావు ఇంటికి వెళ్లగా, వారు భయంతో 112 ఫోన్ చేశారు. దీంతో రావికమతం ఎఎస్ఐ అప్పారావు, మరో ఇద్దరు కానిస్టేబుల్స్ వెళ్లగా, ఆర్మీ ఉద్యోగి భాస్కరరావు వారిపైనా తిరగబడటంతో తిరిగి వెళ్లిపోయారు. జరిగిన సంఘటనను ఎస్ఐ ఉమామహేశ్వరరావుకు వివరించ చడంతో ఎస్ఐ వారి వాగ్మూలంతో భాస్కరరావుపై కేసు నమోదు చేశారు. శుక్రవారం భాస్కరరావును అరెస్ట్ చేసేందుకు ఎస్ఐ ఉమా మహేశ్వరరావు, ఎఎస్ఐ అప్పారావు, హెచ్‌సి శ్రీనివాస్ సిబ్బందితో కలిసి వెళ్లగా సదరు ఆర్మీ ఉద్యోగి ఎస్ఐతో పాటు సిబ్బందిపైనా దాడిచేశాడు. ఈ దాడిలో ఎస్ఐ మోచేతిపై గట్టిగా కొరికి గాయపరిచాడు. ఎఎస్ఐ అప్పారావుకూ, హెచ్‌సి శ్రీనివాస్‌లకూ గాయాలయ్యా యి. సమాచారం తెలుసుకున్న కొత్తకోట సిఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ కొత్తకోట, బుచ్చెయ్యపేట సిబ్బంది తో హుటాహుటీన మేడివాడ చేరుకొని దాడికి పాల్పడిన ఆర్మీ ఉద్యోగి భా స్కరరావును అదుపులోకి తీసుకున్నారు. గాయాలపాలైన ఎస్ఐ ఉమామహేశ్వరరావుకు సిబ్బందికి చికిత్స చేయించారు.



హరిహరన్‌ను అభినందిస్తున్న స్థానికులు

నేషనల్ గ్రాప్లింగ్ రెజ్లింగ్‌లో హరిచరణ్ ప్రతిభ

ప్రజాశక్తి -మధురవాడ : హర్యానాలో సెప్టెంబర్ 29 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలో జమ్ము హరిహరన్ జూనియర్ విభాగంలో బంగారు పతకం సాధించి ఆంధ్రప్రదేశ్ ప్రతిభను చాటాడని కోచ్ ఎం సురేష్, తైక్వాండో కోచ్ సుకుమార్‌సంపత్ తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం మధురవాడలో క్రీడాకారుడ్ని అభినందించారు. కనక దుర్గ క్యాటరింగ్ అధినేత కొర్రాయి సురేష్‌కు బహుమతిని అందించి, మరెన్నో విజయాలు అందుకోవాలని ప్రోత్సహించారు. క్రీడాకారులకు తన ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫిట్‌నెస్ కోచ్ మురళి, నక్కా సాయికుమార్ క్రీడాకారుడిని అభినందించారు.



ఫ్రైడే డ్రైడే లో మాట్లాడుతున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

74వ వార్డులో డ్రైడే ఫ్రైడే

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 74వ వార్డు పరిధి సిద్దేశ్వరం ప్రాంతంలో శుక్రవారం డ్రైడే-ఫ్రైడే డ్రై కార్యక్రమం నిర్వహించారు. 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరూ మాట్లాడారు. డెంగీ, మలేరియా, చికున్ గునియా తదితర సీజనల్ వ్యాధుల నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను స్థానిక ప్రజలకు వివరించారు. ప్రతి శుక్రవారమూ డ్రైడేగా పాటించాలని ప్రజలందరికి సూచించారు. ప్రతిఒక్కరూ తడి-పొడి చెత్తతో పాటు ప్రమాదకర చెత్తగా వేరు చేసి క్లాప్ వెహికల్స్‌కు అందజేయాలన్నారు. ప్లాస్టిక్ సంచులు వినియోగించరాదని, గుడ్డ, నారతో తయారుచేసిన సంచులను వినియోగించి పర్యావరణాన్ని పెంపొందించాలన్నారు. ప్రజలంతా భాగస్వాములై విశాఖ మెరుగైన ర్యాంక్ సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఇ ఎస్.వెంకట్రావు. శానిటరీ ఇన్స్పెక్టర్ టి.నర్సింగరావు, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హిందీ పక్షం వేడుకలు

ప్రజాశక్తి -కరాస: నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజికల్ లేబరేటరీలో (ఎన్ఎస్‌టిఎల్) సెప్టెంబర్ 14 నుంచి ప్రారంభమైన హిందీ పక్షం వేడుకలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో విశిష్ట శాస్త్రవేత్త, ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ పాల్గొని ఎన్ఎస్‌టిఎల్ అంతర్గత వార్షిక హిందీ పత్రిక మంతన్ ఎనిమిదవ ఎడిషన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 15 రోజులుగా హిందీ వ్యాసరచన, హిందీ కథారచన, హిందీ నోట్ అనువాదం, హిందీ ఎక్సెటంపర్, హిందీ నినాదం, హిందీ పద్య పఠనం, హిందీ క్రాస్ వర్డ్, పిపిటి ప్రదర్శన పోస్టర్ తయారీ పోటీలు జరిగాయి. ఇందులో ఎన్ఎస్‌టిఎల్ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌టిఎల్ , ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్న్‌షిప్

ప్రజాశక్తి-ములగాడ : 2020 నూతన విద్యా విధానాన్ని అనుసరించి డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశపెట్టిన కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టును, రెండవ సంవత్సరంలో ప్రవేశపెట్టిన స్వల్పకాలిక నైపుణ్య ఇంటర్న్‌షిప్‌ను, తృతీయ సంవత్సరంలో ప్రవేశపెట్టిన దీర్ఘకాల సెమిస్టర్ ఇంటర్న్ షిప్‌ను విజయవంతంగా సెయింట్ ఆన్స్ కళాశాలలో ముగించారు. ఈ సందర్భంగా జరిగిన విజయోత్సవ సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి మాట్లాడుతూ, కలిసికట్టుగా అధ్యాపకులందరూ ఈ ఇంటర్న్‌షిప్‌లను విజయవంతం చేశారని, ఇది సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థుల క్రమశిక్షణకు, అధ్యాపకుల టీం వర్క్‌కు నిదర్శనమని పేర్కొన్నారు. ఇంటర్న్ షిప్‌ల కళాశాల ఇన్‌ఛార్జి, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు వై.అనసూయాదేవిని ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అభినందించారు. ఇంటర్న్ షిప్పుల విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ అనసూయాదేవి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఇంటర్న్ షిప్పులలో భాగం పంచుకున్న అధ్యాపకులకు కళాశాల ప్రిన్సిపల్ ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల సుపీరియర్ సిస్టర్ జయశీల మాట్లాడుతూ- లక్ష్య సాధనకు అంత కలసికట్టుగా పని చేయాలన్నారు. ఇంతటి విజయాన్ని కళాశాలకు అందించిన అనసూయదేవిని ప్రశంసించారు.

రెడ్డి అరుణకు డాక్టరేట్

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్య విభాగం పరిశోధక విద్యార్థి రెడ్డి అరుణకు వర్సిటీ డాక్టరేట్ లభించింది. ఎయు వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి గురువారం ఉదయం ఉత్తర్వులను అందించారు.. విభాగ ఆచార్యులు టి.షారోన్‌రాజు పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆఫ్ టెక్నోఫోబియా ఇన్ ద యూజ్ ఆఫ్ ఐసిటి ఎమాంగ్ సెకండరీ స్కూల్ టీచర్స్ ఇన్ విజయనగరం డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. తన పరిశోధనలో భాగంగా విజయనగరం జిల్లాలో పనిచేస్తున్న హైస్కూల్ ఉపాధ్యాయులలో ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసిటి) వినియోగంలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వారి సంసిద్ధత అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. జిల్లాలలో పనిచేస్తున్న 500 మంది అధ్యాపకుల నుంచి వివరాలు సేకరించి, విశ్లేషణ చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది.

గీతంలో కాశ్మీరీ యువత సందడి



గీతంలో సందడి చేస్తున్నకాశ్మీరీ యువత

ప్రజాశక్తి-మధురవాడ : భారత ప్రభుత్వ యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యాన కాశ్మీర్‌లోని వివిధ జిల్లాల నుంచి విశాఖ వచ్చిన 120 మంది యువత శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సందడి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర రాష్ట్ర డైరెక్టర్ ఎ.విజయరావు మాట్లాడుతూ, కాశ్మీర్ యువత భవిష్యత్తును తీర్చిదిద్దుకునేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ద్వారా కాశ్మీరి యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాన్ని విశాఖలో అక్టోబర్ 2వ తేదీన ప్రారంభించామని తెలిపారు. కాశ్మీరి యువతకు దేశ శాస్త్ర, సాంకేతిక రంగాలలో సాధిస్తున్న ప్రగతిని తెలియజేయడం పారిశ్రామిక అభివృద్ధి, దేశంలోని వివిధ ప్రాంతాలలో యువత ఆకాంక్షలను తెలుసుకునే అవకాశం కల్పించడం కార్యక్రమం ముఖ్యఉద్దేశమని తెలిపారు. గీతం స్టూడెంట్ లైఫ్ డైరెక్టర్ డాక్టర్ రీమా చౌదరి మాట్లాడుతూ, ప్రభుత్వం యువతను ప్రోత్సహించడానికి నైపుణ్యాలను పెంచే కార్యక్రమాలతో పాటు స్టార్టప్‌లను సహితం ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తోందన్నారు. గీతం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.సురేష్‌కుమార్ యువత సేవా కార్యక్రమంలో పాల్గొనడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ ఎస్.వంశీకిరణ్ వివిధ కోర్సుల ద్వారా లభించే ఉపాధి అవకాశాలను తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ గోపీనాథ్ ఆధ్వర్యాన గీతం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కాశ్మీరీ యువత తమ అభిప్రాయాలను పంచుకోవడంతో పాటు తమ సంస్కృతి సంప్రదాయాలపై అకట్టుకునేలా ప్రదర్శన ఇచ్చారు.

రేడియేషన్ ప్రభావంపై పరిశోధనకు అవకాశాలు

ప్రజాశక్తి-మధురవాడ : వైద్య ఆరోగ్య రంగం నుంచి అంతరిక్ష రంగం వరకు మానవ ఆరోగ్యంపై రేడియేషన్ ప్రభావం ఏవిధంగా ఉందో అధ్యయనం చేయడానికి పరిశోధనలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని ముంబైలోని బాబా అణుశక్తి పరిశోధన కేంద్రం మెడికల్ గ్రూప్ అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ కె.భల్వీందర్ కె.సప్ర పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మానవ ఆరోగ్యంపై రేడియేషన్ ప్రభావం, పరిశోధన అవకాశాలపై ఆమె ప్రసంగించారు. వాతావరణంలో ఉండే రేడియేషన్ మానవ ఆరోగ్యంపై పెద్దగా ప్రభావం చూపదని అయితే కేన్సర్ చికిత్స, ఎక్స్‌రేల వినియోగంలో జరిగే రేడియేషన్‌పై తామ అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. గగన్ యాన్ అంతరిక్ష ప్రయోగంలో వ్యోమగామిపై రేడియేషన్ ప్రభావం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధ్యయనం చేసే అవకాశం తమకు లభించిందన్నారు. అణుభౌతిక శాస్త్రం అభ్యసించే విద్యార్థులకు ఈ రంగంలో పరిశోధనకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. బార్క్‌లోని తమ విభాగం పలు శిక్షణ కార్యక్రమాలతో పాటు డిప్లమో కోర్సులను నిర్వహిస్తోందని, వాటిని పూర్తి చేసిన వారికి దేశ విదేశాలలో ఉద్యోగఅవకాశాలు లభిస్తున్నాయని వివరించారు. కార్యక్రమానికి గీతం జీవ శాస్త్ర విభాగాల విశిష్ట ప్రొఫెసర్ హరిమిశ్ర అధ్యక్షత వహించారు.



రేడియేషన్ ప్రభావంపై మాట్లాడుతున్న శాస్త్రవేత్త

భాగ్యలక్ష్మికి ఘన సన్మానం



భాగ్యలక్ష్మిని సన్మానిస్తున్న డాక్టర్ హేమలత తదితరులు

ప్రజాశక్తి -ములగాడ : ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి, సెయింట్ ఆన్స్ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకులు ఇపిఎస్.భాగ్యలక్ష్మిని మల్కాపురం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యాన పౌర సన్మానం చేశారు. డాక్టర్ పి.హేమలత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భాగ్యలక్ష్మి 30 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలలో విద్యార్థులను నిమగ్నం చేసి, వారి వ్యక్తిత్వ వికాసానికి కృషి చేశారని తెలిపారు. సమావేశంలో అభినందన పత్రాన్ని ప్రముఖ న్యాయవాది జికెవి.రాజు సమర్పించారు. సామాజిక సేవలో, యువజన వ్యవహారాల్లో, బోధనా పద్ధతుల్లో ఆమె చేసిన విశేష కృషికి ఎన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించాయని తెలిపారు. వి.అజయ్ కుమార్ మాట్లాడుతూ, శాఖా గ్రంథాలయ అభివృద్ధికి ఆమె ఎంతో సహకారాన్ని అందిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో పాత్రికేయులు సుంకరి చలపతిరావు, కవి కె.సత్తిరాజు,కార్మిక నాయకులు సత్యానందం, జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి, మహిళా మండలి నాయకులు, జగదాంబ బుక్ సెంటర్ అధికారి రాఘవ తదితరులు భాగ్యలక్ష్మి గురించి మాట్లాడి, ఆమెను ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీత భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, ఇటువంటి సత్కారాలు బాధ్యతను పెంచుతాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి -మాధవధార : అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు తెలిపారు. మాధవస్వామి కల్యాణ మండపంలో జెసిఎస్ మండలం-5 (51, 53, 54 వార్డులుకు) సంబంధించి సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరోగ్య సురక్ష పథకం ద్వారా పేదలకు మంచి వైద్యం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, స్టాండింగ్ కమిటీ మెంబర్ చల్లా రజిని, కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలి, వావిలపల్లి ప్రసాద్, యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత, వైసిపి నాయకులు చల్లా ఈశ్వరరావు, గుజ్జు వెంకటరెడ్డి, కృష్ణారావు మాస్టర్, అమర్ రెడ్డి, పైడి శ్రీను పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం వైద్యశాలలో ఏర్పాటుచేసిన ఉచిత ఆరోగ్య వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రెండో రోజు శిబిరానికి పెద్దసంఖ్యలో విద్యార్థులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. న్యూట్రిషన్ ఫోకస్డ్ ఫిజికల్ ఎగ్జామినేషన్ విధానంలో ఎటువంటి రక్త పరీక్షలు నిర్వహించకుండా వ్యక్తి ఆరోగ్యాన్ని పరీక్షించి తగిన సూచనలు వైద్యులు, పోషకాహార నిపుణులు అందించారు. రెండు రోజుల్లో నిర్వహించిన వైద్య శిబిరానికి 200 మంది బోధన సిబ్బంది, సుమారు 250 మందికిపైగా విద్యార్థులు హాజరై ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

అంతర్జాతీయ బాలికా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విశాఖపట్నం : అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని కిడ్స్ క్రియేట్ పాఠశాల విద్యార్థులు తీర్చిదిద్దిన పోస్టర్‌ను ఎయు విసి ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. బాలికల ప్రాధాన్యతను తెలిపే విధంగా అవగాహన ర్యాలీని నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ నెల 10న ర్యాలీని నిర్వహించనున్నట్లు పాఠశాల ఇన్‌ఛార్జి రొటేరియన్ మోదాంబిక వివరించారు. విద్యార్థులు ఎంతో అవగాహనతో సమాజానికి మంచి సందేశం అందించేలా తీర్చిదిద్దిన చిత్రాలను, వారి ప్రతిభను ప్రశంసించారు. పాఠశాల స్థాయిలో చిన్నారుల్లో సామాజిక అంశాలపై అవగాహన కల్పించడం వల్ల వారు మంచి పౌరులుగా ఎదగడం సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో రొటేరియన్ వినయ్ గాంధీ, రజియా సుల్తానా, మీనా పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు పరిధి బిటిఆర్ కాలనీ, రెల్లి వీధిలో రూ.20లక్షల వ్యయంతో బిటి, రోడ్లు, సిసి డ్రెయిన్ల నిర్మాణాలకు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ ఆధ్వర్యాన ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వానికి రెండు కళ్లు లాంటివని, ఆ దిశగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జివి.రమణి, మురళీకృష్ణారెడ్డి, సానబోయిన సురేష్, బోగవల్లి గోవింద్, హరికృష్ణ, అంబటి శైలేష్, ఎం.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు ల్యాండ్ పూలింగ్‌పై రైతుల నిరసన

జీడి మామిడి తోటల తొలగింపు అడ్డగింత

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని వేట జంగాల పాలెం గ్రామంలో బలవంతపు ల్యాండ్ పూలింగ్‌పై బాధితులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. వియంఆర్‌డిఎ అధికారులు జీడి మామిడి తోటలను తొలగించడాన్ని శుక్రవారం రైతులు అడ్డుకున్నారు. ట్రాక్టర్, జెసిబిల ముందు ఆందోళన చేపట్టారు. అనంతరం అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం వద్ద వెళ్లి ధర్నా చేశారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితులు, ల్యాండ్ పూలింగ్ నిర్వాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గంట శ్రీరామ్, దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా కన్వీనర్ కొల్లి సత్యారావు మాట్లాడుతూ ల్యాండ్ పూలింగ్‌లో రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించినా రెవెన్యూ సిబ్బంది బలవంతంగా రైతుల భూములను లాక్కోవడం దారుణమన్నారు. హైకోర్టు ఆదేశాలతో గతంలో వేట జంగాల పాలెం గ్రామంలో 40 మంది రైతుల భూముల జోలికి నాటి అధికారులు వెళ్లలేదని, అయితే నాలుగేళ్ల తరువాత ఇప్పుడు వియంఆర్‌డిఎ అధికారులు బలవంతంగా భూముల్లోకి వెళ్లి జీడి మామిడి తోటలను తొలగించడం దుర్మార్గమన్నారు. హైకోర్టు తీర్పును ఉల్లంఘిస్తున్న అధికారులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చిన రైతులకు నేటికీ న్యాయం చేయలేదని, ఇప్పుడు మళ్లీ ల్యాండ్ పూలింగ్‌కు పాల్పడటం దారుణమన్నారు.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 6116 ఎకరాలు భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా తీసుకోవాలని ప్రభుత్వం ప్రయత్నించగా 4400 ఎకరాల భూమికి మాత్రమే అంగీకారం తెలిపారని, మిగతా భూములు తీసుకోమని అధికారులే హైకోర్టు తెలియజేశారని గుర్తు చేశారు. కోర్టుకు తెలియజేసిన దానికి కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలని, లేదంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజాన గోవింద, బొడ్డు కాసులు, బండి రాము, భీమిని సూకరాజు, కె.కొండబాబు, కె.శ్రీనువాసరావు, జి.ఈశ్వరరావు, బండి దుర్గాలమ్మ, బోరమ్మ, అచ్చియ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు. అలాగే కుంచంగిలో ల్యాండ్ పూలింగ్ రైతులు చేస్తున్న పోరాటానికి సంఘీభావం తెలిపారు.



తోటల తొలగింపును అడ్డుకొని నిరసన తెలుపుతున్న రైతులు, నిర్వాసిత నాయకులు

జీడి రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-దేవరాపల్లి

జీడీ పంటకు గిట్టుబాటు ధర ప్రకటించి ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కోరుతూ ఈ నెల 10న శ్రీకాకుళం జిల్లా పలాసలో జరుగు జీడి రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీడి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు దళారీల దోపిడీకి గురై తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీడి పంటకు ధర ప్రకటించడం లేదని, దీనిని అవకాశంగా తీసుకొని వ్యాపారులు తమకు ఇష్టం వచ్చిన ధరకు రైతుల వద్ద కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 10న పలాస లోని కాశీబుగ్గ టికెఆర్ కళ్యాణమండపంలో జరుగు సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాసు, ఏపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ వక్తలు పాల్గొంటారని, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

రాహుల్‌గాంధీపై అనుచిత పోస్టులు బాధాకరం

ప్రజాశక్తి- అనకాపల్లి : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై బిజెపి తన ట్విట్టర్లో అనుచితమైన, అభ్యంతరకరమైన రీతిలో పోస్టు పెట్టినందుకు నిరసనగా జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నెహ్రూ చౌక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి బొడ్డు శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో బిజెపి గ్రాఫ్ రోజు రోజుకి పడిపోతున్నందు వల్ల నిరాశ, నిస్పృహలకు లోనైన బిజెపి నాయకులు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ మానసిక ఆనందాన్ని పొందుతున్నారని విమర్శించారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారబోస్తూ దేశాన్ని సర్వనాశనం చేస్తున్న బిజెపి విధానాలను ప్రశ్నిస్తున్నందున రాహుల్ గాంధీపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దాసరి సంతోష్, ఐఆర్. గంగాధర్, ఆడారి రమేష్ నాయుడు, పిఎస్. దత్తు, మలపరెడ్డి కోటేశ్వరరావు, కత్తెర శ్రీధర్, కాళ్ల సత్యనారాయణ, బుద్ధ కిషోర్, రుత్తల సూర్యకుమారి, తుట్టా రమణ, కట్టుమూరి నూక అప్పారావు, జి. గున్న బాబు, పడాల కొండలరావు పాల్గొన్నారు.

మహా పాదయాత్రను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-చోడవరం

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ ఆలంపూర్ నుండి హైదరాబాదు వరకు శనివారం నుంచి ప్రారంభిస్తున్న మాదిగల మరో విశ్వరూప మహా పాదయాత్రను విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు సామ్రాట్ మాదిగ పిలుపునిచ్చారు. వి.మాడుగుల మండల కేంద్రం అంబేద్కర్ కాలనీలో మహాజన్ సోషలిస్ట్ పార్టీ మండల అధ్యక్షులు జల్లీ అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సామ్రాట్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్ట్ పార్టీ, వివిధ అనుబంధ సంఘాల నాయకులందరూ ఇందులో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంఎం దాసు మాదిగ, ఏలుసూరి ఘాటీలు మాదిగ, పరదేశి నాయుడు మాదిగ, గొట్టువాడ పెంటారావు మాదిగ, కార్యకర్తలు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

ప్రజాశక్తి-చోడవరం

2024 ఎన్నికల్లో అధికారం సాధించడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని లక్కవరం గ్రామంలో పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, వాలంటీర్లకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ, మండల కమిటీలు గ్రామాలను సందర్శించి, అక్కడే బస చేసి ప్రజలు, కార్యకర్తలతో మమేకం కావాలని సూచించారు. నియోజకవర్గ పరిశీలకులు చొక్కాకుల వెంకట్రావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ధర్మశ్రీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేటి ప్రసాద్, ఎంపీపీ గాడి కాసు, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నరసింహారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, వైసిపి మండల అధ్యక్షుడు డి వెంకట్రావు, వైస్ ఎంపీపీ బుద్ధ గంగరాజు, పార్టీ నాయకులు వెంపలి ఆనంద్ ఈశ్వరరావు, బొడ్డేటి సూర్యనారాయణ, పతివాడ అప్పారావు, పుల్లేటి వెంకట్రావు, చోడవరం సర్పంచ్ బండి సూరపాలమ్మ శ్రీను, మూడెడ్ల శంకర్రావు, దేవరపల్లి సత్య తదితరులు పాల్గొన్నారు.

సర్వజ్ఞ హైస్కూల్ అధినేత నరసింహారావు గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి-పరవాడ

పరవాడ సర్వజ్ఞ హైస్కూల్ వ్యవస్థాపకులు బొడ్డు నరసింహారావు (55) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. నరసింహారావు ఎల్‌కెజి నుండి పదవ తరగతి వరకు తక్కువ ఫీజులతో ఈ ప్రాంత విద్యార్థులకు విద్యను అందిస్తున్నారు. అందరితో స్నేహం పూర్వకంగా ఉండేవారు. ఆయన మృతి ఈ ప్రాంత విద్యారంగానికి తీరని లోటు. నరసింహారావు మృతి చెందారని తెలిసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఈ ప్రాంత ప్రజలు శోక సముద్రంలో మునిగిపోయారు.



నరసింహారావు (ఫైల్‌ఫొటో)

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం

ప్రజాశక్తి-చోడవరం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతంలో మెరుగైన వైద్యం అందుతుందని వైసిపి వైద్య విభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ బండారు సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యతోపాటు వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇప్పటికే ప్రతి సచివాలయ పరిధిలో క్లినిక్‌లు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని చెప్పారు. షుగర్ బీపీ వంటి వ్యాధి లక్షణాలతో బాధపడే గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రాణాంతక వ్యాధులకు ఖరీదైన వైద్య ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలో అనేక చోట్ల మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. మంచి అలవాట్లు అలవర్చుకుంటే ఆరోగ్యం మన చేతిలోనే ఉంటుందన్నారు.



డాక్టర్ బండారు సత్యనారాయణ

వినాయక ఉత్సవాల్లో పాల్గొన్న ముత్యాల సతీష్

ప్రజాశక్తి-అనకాపల్లి

బుచ్చయ్యపేట మండలం వరసిద్ధి వినాయక మహోత్సవంలో ప్రముఖ వ్యాపారవేత్త ఎంవిఆర్ తనయుడు ముత్యాల సతీష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ముత్యాల సతీష్‌ను గ్రామ ప్రజలు పూల వర్షంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన చేతుల మీదుగా వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని, అందుకు తమ వంతు ఆర్థిక సహాయం చేయటానికి తామెప్పుడూ ముందుంటామని సతీష్ తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులు ముత్యాల సతీష్‌కు దుస్సాలువాతో సన్మానించి చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.వి.ఆర్ యూత్ సభ్యులు, సంజు టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అన్న సమారాధనను ప్రారంభిస్తున్న ముత్యాల సతీష్

చెక్‌పోస్టుల వల్ల గంజాయి రవాణా తగ్గుముఖం

విశాఖ రేంజ్ డిఐజి హరికృష్ణ

ప్రజాశక్తి-కె.కోటపాడు

ఉమ్మడి విశాఖ జిల్లాలోని మండలాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం వల్ల ఏజెన్సీ నుండి వచ్చే గంజాయి 99 శాతం తగ్గు ముఖం పట్టిందని విశాఖ రేంజ్ డిఐజి హరికృష్ణ తెలిపారు. శుక్రవారం కె.కోటపాడు పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గంజాయి రవాణాపై ఉక్కు పాదం మోపుతూ, మరోపక్క అటవీ అధికారుల సహకారంతో గంజాయి పంటలను ధ్వంసం చేయడం జరుగుతుందని చెప్పారు. జిల్లాలో ఎక్కువగా నాటు సారా తయారు చేస్తున్న రెండు వందల మందికి ప్రత్యామ్నాయ ఉపాధి చూపించామని, అప్పటినుండి సారా తయారీ తగ్గిందని వెల్లడించారు. వచ్చే పండగలను దృష్టిలో పెట్టుకొని బాణసంచా తయారీదారులపై నిఘా పెట్టమన్నారు. బాణసంచా విక్రయదారులు ముందుగా లైసెన్స్ పొందాలని సూచించారు. ఈ సంవత్సరం ట్రాఫిక్ నిబంధనలు పెంచడంతో గణనీయంగా రోడ్డు ప్రమాదాలు నివారించగలిగామని తెలిపారు. డిఐజి వెంట అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ, సిఐ తాతారావు, కె.కోటపాడు, ఎ.కోడూరు ఎస్సైలు ధనుంజయ్, రామకృష్ణ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న డిఐజి హరికృష్ణ, చిత్రంలో ఎస్‌పి మురళీకృష్ణ



కందువాలతో జోలు పట్టి నిరసన తెలుపుతున్న జనసేన నేతలు

చెరుకు బకాయిలు చెల్లించాలని వినూత్న నిరసన

ప్రజాశక్తి-చోడవరం : గోవాడ చక్కెర కర్మాగారం రైతులకు గత క్రషింగ్ సీజన్‌కు సంబంధించి బకాయి ఉన్న రూ.9కోట్లు తక్షణమే చెల్లించాలని కోరుతూ జనసేన ఆధ్వర్యంలో గోవాడ ఫ్యాక్టరీ వద్ద ఆ పార్టీ నాయకులు రైతులతో కలిసి కండువాలు చాపి దేహీ దేహీ అంటూ వినూత్న పద్ధతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ పివిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ గత వారంలో జరిగిన ఫ్యాక్టరీ మహాజన సభలో రూ.9 కోట్ల బకాయిలు చెల్లింపునకు హామీ ఇచ్చిన ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఇప్పటివరకు ఆ హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. వెంటనే బకాయిలు చెల్లించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గునూరు సూర్యనారాయణ, గునూరు మూలునాయుడు, డిఎస్ నాయుడు, బలిజ మహారాజు, అల్లం రామ అప్పారావు, పీలా మహేష్, ఆడారి నాయుడు, వెంకట అప్పారావు, పరవాడ దొరబాబు, కర్రి రమేష్ పాల్గొన్నారు.

ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు అభినందనలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్ పదవీ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ శ్రీనివాసరావును ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం కలిసి చిరు సత్కారం చేసి అభినందించారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో ఉన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, సూదికొండ మాణిక్యాలరావు, బొడ్డు సోమరాజు, బొబ్బిలి గోవిందరాజులు, ముగడా అప్పారావు, పల్లా సత్యఅప్పారావు, సూర్యారావు, భరణికాన సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రేపు పలు ప్రారంభోత్సవాలు

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలం మర్రివలస గ్రామంలో ఆదివారం మంత్రులచే పలు ప్రారంభోత్సవాలు చేపడుతున్నట్లు ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ తెలిపారు. వైసిపి ఉత్తరాంధ్ర సమన్వయకర్త వై.సుబ్బారెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు, అనకాపల్లి ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి తదితరులు నిర్మాణాలు పూర్తి చేసుకున్న గ్రామ సచివాలయం, ఆర్‌బికె, హెల్త్ వెల్నెస్ సెంటర్లను, రూ.80 లక్షలతో చేపట్టిన ఇంటింటి కుళాయిలు, రూ.90 లక్షలతో చేపట్టిన సిసి రోడ్లను ప్రారంభిస్తారని వెల్లడించారు. అనంతరం సచివాలయ ఆవరణలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు.

మంత్రిని కలిసిన ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఏపీయూడబ్ల్యూజే అనకాపల్లి ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం స్థానిక రింగ్ రోడ్డులో గల వై.సి.పి కార్యాలయంలో రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి మంత్రి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా నూతన అధ్యక్షులు శిలపరశెట్టి ప్రసాద్ బాబు, ఉపాధ్యక్షులు భీమరశెట్టి నూకేష్, విడివి కొండలరావు, అనకాపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొయిలాడ చంద్రశేఖర్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా సహాయ కార్యదర్శి వై రమణాజీ పాల్గొన్నారు.

8న క్లాప్ డ్రైవర్ల రాష్ట్ర సదస్సుకు తరలిరండి

ప్రజాశక్తి-అనకాపల్లి : విజయవాడలో ఈనెల 8న చేపట్టే క్లాప్ డ్రైవర్ల రాష్ట్ర సదస్సుకు తరలివచ్చి జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కోన లక్ష్మణ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయితీలలో పనిచేస్తున్న క్లాప్ మిత్ర డ్రైవర్ల సమస్యలు పరిష్కారం చేయాలని విజయవాడ గొల్లపూడి జోశ్య భట్ల సత్యనారాయణ భవన్‌లో ఈ నెల 8న సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ డ్రైవర్లతో సమానంగా రూ.18,500 ఇస్తామని, ఈఎస్ఐ, పిఎఫ్ నెలనెలా చెల్లిస్తామని నమ్మబలికి డ్రైవర్లచే సొమ్మును కట్టించుకున్న 6 ఏజెన్సీలు గత రెండేళ్లగా పట్టించుకోలేదని, చట్టబద్ధంగా చెల్లించాల్సిన వేతనం చెల్లించలేదని పేర్కొన్నారు.

పెంజెరువులో చేపల పెంపకమా.. తెలీదే!

- జలవనరుల శాఖ దాటవేత ధోరణి
- తమకు ఎరుకే లేదంటున్న మత్స్యశాఖ
- రూ.లక్షల్లో వేలం పాట జరుగుతుందంటున్న రైతులు

ప్రజాశక్తి - యలమంచిలి

సొంత సహజ వనరులను సైతం రక్షించుకోలేని అసహాయస్థితిలో ఉంది స్థానిక జలవనరులశాఖ. తమ శాఖ అధీనంలోని చెరువుల్ని రక్షించాల్సిన ఆ శాఖ అధికార్లు ఏ చెరువులో ఏం జరుగుతోందో గమనించలేని నిస్సహాయస్థితిలో ఉన్నారు. యలమంచిలి ప్రాంతంలో ఉన్న ఏకైక పెద్ద సహజ చెరువు 'పెంజెరువు'. 40 హెక్టార్ల గర్భంగల ఈ చెరువు ఆయకట్టు 250 ఎకరాలు. ప్రస్తుతం 9 హెక్టార్లు మాత్రమే నీటి నిల్వకు ఉపయోగపడుతోంది. నీటి ఎద్దడి ఏర్పడి చెరువు కింద భూములు చాలా వరకు వరి ఉడుపులకు నోచుకోలేదు. ఇదే విషయమై యలమంచిలి జలవనరులశాఖ జెఇ శివరామకృష్ణను అడగ్గా, కాలువ పనులు చేయించడానికి తమ వద్ద నిధులు లేవని, చేసినవాటికే నిధులు రాలేదని తెలిపారు. చేపల పెంపకం ద్వారా రూ.లక్షల్లో ఆదాయం వస్తోందని చెరువు ఆయకట్టు రైతులు చెబుతున్నారు. వచ్చే ఆ సొమ్ము ఏమౌతోందన్న ప్రశ్నకు మత్స్యశాఖ వారిని అడగండని జలవనరుల శాఖ జెఇ శివరామకృష్ణ అంటున్నారు.

'పెంజెరువు'లో చేపల పెంపకం గురించి నక్కపల్లి మత్స్యశాఖ అభివృద్ధి అధికారి శృతిని వివరణ కోరగా... 'మండలంలోని ఏ చెరువునీ చేపల పెంపకానికి వేలం వేయలేదు. మాకు తెలియకుండా వేలం నిర్వహించడం నేరం. చాలా ఏళ్ల క్రితం ఏడాదికి రూ.3వేలు వేలం చొప్పున వేలంపాడి సొమ్ము కట్టేవారు. ఇటీవల అది కూడా కట్టడం లేదు. 'పెంజెరువు'లో చేపల పెంపకం జరుగుతున్నట్లు ఎవరూ మాకు తెలియజేయలేదు. అటువంటిదేమైనా జరిగినట్లు విచారణలో బయటపడితే చర్యలు తీసుకుంటాం' అని తెలిపారు. ఇటీవలే కొందరికి ట్రైనింగ్ ఇచ్చి సొసైటీగా ఏర్పాటు చేస్తున్నామని, వారికి పెంజెరువుతోపాటు రుక్మిణీపురం, పోతిరెడ్డిపాలెం, పురుషోత్తపురం, తెరువుపల్లి, పులపర్తి చెరువుల్ని కూడా చేపల పెంపకానికి ఇవ్వబోతున్నామని ఫిషరీస్ డిఇ శృతి వెల్లడించారు. వేలం పాటలో వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వం నిర్ణయించిన నిష్పత్తిలో పంచాయతీ, మత్స్యశాఖ, జలవనరు శాఖలకు వాటాగా వెళ్తాయని తెలిపారు.



పెంజెరువు ఇదే..

కొనసాగుతున్న టిడిపి నిరసనలు



కాగడాల ప్రదర్శనలో పాల్గొన్న టిడిపి నాయకులు

చంద్రబాబు అరెస్టును వ్యతిరేకిస్తూ ఆ పార్టీ ఆధ్వర్యాన దీక్షలు కొనసాగుతున్నాయి.

ప్రజాశక్తి-భీమునిపట్నం

భీమిలిలోని టిడిపి కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షలు శుక్ర వారం నాటికి 27వ రోజుకు చేరుకున్నాయి. పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో నాయకులు ఎం.లక్ష్మణరావు, జి.పోలిరాజు తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : జివిఎంసి 62వ వార్డు పరిధి త్రినాధపురం జంక్షన్ నుంచి గుడివాడ అప్పన్న కాలనీ గాంధీ విగ్రహం వరకు వార్డు అధ్యక్షులు మజ్జి మాలినాయుడు ఆధ్వర్యాన కాగడాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సీతారాం, లాలం లావణ్య, సన్యాసిరావు, నరసింగరావు, కోరిబిల్లి రాము, హరికుమార్, అప్పన్న, చంద్రశేఖర్, ఆది, హరిహర రాజు, వాసు, దిలీప్, రాము, సూర్యనారాయణ, శ్రీను, శ్రీధర్, లక్ష్మి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో టిడిపి, జనసేన పార్టీల కార్యకర్తలు శుక్రవారం కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. పట్టణంలోని గొల్ల వీధి, స్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాధంశెట్టి నీలబాబు, కుప్పిలి జగన్మోహన్, బోడీ వెంకట్రావు, జనసేన నాయకులు శ్రీకాకుళం జగ్గారావు, కోట్ని సూరిబాబు, కొమ్మోజు రాజు, రోకలి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని ఏనుగు తుని గ్రామంలో శుక్రవారం బాబుతో నేను కరపత్రాలను టిడిపి నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి నాయకులు గొంతుని శ్రీనివాసరావు, కాయల మురళి, ఉగ్గిన రమణ మూర్తి, వేగి గోపీకృష్ణ, గొంతిన నూకరాజు, ఎంపీటీసీ షేక్ దర్గా, మజ్జి నిరంజన్ కుమార్, కర్రి దుర్గి నాయుడు, నైనం శెట్టి రమణ రావు, ఉల్లింగల రమేష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతుకు లాభం

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రకృతి వ్యవసాయ విధానంతో రైతుకు ఎంతో లాభసాటిగా ఉంటుందని ప్రకృతి రైతు సాధికార సంస్థ మార్కెటింగ్ మాస్టర్ సిరసపల్లి అప్పలరాజు అన్నారు. మండలంలోని బగులవాడ గ్రామంలో శుక్రవారం రైతు సాధికార సంస్థ మార్కెటింగ్ లోకల్ గ్రూపు రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలో వరి పంటలో సుడి దోమ నివారణకు ముందు జాగ్రత్త చర్యగా పిచికారి చేసేందుకు తూటికాడ కషాయం తయారు చేశారు. ఈ కషాయం వలన వరిలో దోమ నివారణ అవుతుందని గ్రూప్ సభ్యులు పేర్కొన్నారు. ఈ కషాయం ఉపయోగించడం వల్ల రైతుకు ఎకరానికి 2000 రూపాయలు ఆదా అవుతుందన్నారు. ఈ విధంగా పండించిన ఉత్పత్తులను ఆర్గానిక్ షాపుల్లో, లోకల్ మార్కెటింగ్ చేసుకోవచ్చని మార్కెటింగ్ ఎన్ఎఫ్‌ఏ వర్మ పేర్కొన్నారు. ఈ గ్రూపులో ఉన్న సభ్యులందరికీ పి జి ఎస్ సర్టిఫికేషన్ ఇవ్వడం జరుగుతుందని, దానిద్వారా రైతు పండించిన ఉత్పత్తులను మనదేశంలో ఎక్కడైనా అమ్ముకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జి సత్యారావు, కరణం వెంకటరమణ, మహిళా సంఘ ప్రతినిధులు, రైతులు పాల్గొనడం జరిగింది.

జగనన్న ఆరోగ్య సురక్ష ఫోల్డర్స్, సంచుల ముద్రణకు టెండర్ల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఫోల్డర్స్, సంచుల ముద్రణ, సరఫరా చేయడానికి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ హేమంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ల దరఖాస్తులను Anakapalli.ap.gov.in వెబ్సైటు అనే వెబ్‌సైట్ నుండి ఈ నెల 7 నుండి 9వ తేదీ వరకు డౌన్లోడ్ చేసుకొని దరఖాస్తులు అదే తేదీల్లో సమర్పించాలని సూచించారు. దరఖాస్తులను ఈ నెల 9వ తేదీ లోగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి అనకాపల్లి వారి కార్యాలయం పని దినాలలో ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలన్నారు. మరింత సమాచారం కొరకు ఎన్‌హెచ్ఎం, డిపిఎం, యూనిట్, డిఎంహెచ్ఎం అనకాపల్లి వారిని సంప్రదించాలని కోరారు.



సాయి విమల మృతదేహం

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - యలమంచిలి : స్థానిక కొరారు శ్రీను పెట్రోలు బంకు ఎదురింట్లో శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో ఓ వివాహిత ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు టౌన్ ఎస్ఐ పాపినాయుడు తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శశికాంత్ భార్య అంగా సాయివిమల (25) ఆత్మహత్యకు పాల్పడిందని, కారణాలు ఇంకా ఏమీ తెలియరాలేదని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిస్తామని టౌన్ ఎస్ఐ తెలిపారు.

డెంగీ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక బెల్లం మార్కెట్ యార్డులో శుక్రవారం ఎన్టీఆర్ వాకర్స్ క్లబ్ సంఘం సర్వసభ్య సమావేశంలో డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించారు. సంఘ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా ఉపాధ్యక్షులు డాక్టర్ డి డి నాయుడు మాట్లాడుతూ డెంగీ వ్యాపించే విధానం తెలియజేస్తూ ఈడిస్ ఇజిప్ట్ అనే దోమ కాటు ద్వారా శరీరంలోకి వ్యాపిస్తుందని, ఇది తీవ్రతరం అయితే తెల్ల రక్త కణాలు, ఎర్ర రక్త కణాలు క్షీణిస్తాయని తెలిపారు. శరీరంలో ప్లేట్లెట్స్ రెండువేల కంటే తక్కువ ఉంటే వెంటనే డాక్టర్లను సంప్రదించి ప్లేట్లెట్ వృద్ధికి జాగ్రత్తలు తీసుకోవాలని, లేకపోతే ప్రాణాలకే ప్రమాదమని సూచించారు. అనకాపల్లి వాకర్స్ క్లబ్ అధ్యక్షులు యల్లపు శివ, ఎన్టీఆర్ వాకర్స్ క్లబ్ కార్యదర్శి ఎంవీ లోవరాజు, భీశెట్టి టాటా కోరాడ మల్లేష్, కాండ్రేగుల ఆదిబాబు, కాండ్రేగుల వెంకట సూరి, శిలపరిశెట్టి భాస్కరరావు, కొణతాల ఆది నాగేశ్వరరావు, సూరిశెట్టి జగ్గారావు, పిరమిడ్ ఆర్గనైజర్ కాండ్రేగుల నూక రామలింగస్వామి, క్రైసర్ల చిన్న తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అమర్‌నాథ్ హుందాగా వ్యవహరించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : తెలుగుదేశం, జనసేన పార్టీల పొత్తుపై మంత్రి గుడివాడ అమర్నాథ్ హుందాగా వ్యవహరించాలని జనసేన నాయకులు హితవు పలికారు. అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి బలవంతుడు కనుకనే అందరు ఏకం అవుతున్నారని అమర్ అనుకుంటున్నారని, నిజానికి జగన్ మూర్ఖుడని, అందుకే అందరూ ఏకమై జగన్‌ని ఓడించాలని అనుకుంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో దూలం గోపి, తాడి రామకృష్ణ, మళ్ల శ్రీను, బర్నికాన రాము, అప్పికొండ గణేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఆరోగ్య సురక్ష' వైద్యశిబిరాలు



అనకాపల్లిలో ఆరోగ్యసురక్ష శిబిరం పరిశీలిస్తున్న కలెక్టర్

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు శుక్రవారం పలుచోట్ల కొనసాగాయి. శిబిరాలకువచ్చిన రోగులకు వైద్యులు తనిఖీలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యాన పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు.

(ప్రజాశక్తి-యంత్రాంగం)

రావికమతం: మండలంలోని గర్నికం ప్రాథమిక పాఠశాల వద్ద సర్పంచు కేశంశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సురక్ష ఆరోగ్యశిబిరంలో వైద్యులు డాక్టర్ అశోక్‌కుమార్, పి.మమత, దుర్గాప్రసాద్, రజని, విజయకుమార్ పాల్గొని, 398మంది ంగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకన్న బాబు, హెచ్ఎస్ సత్యనారాయణ, సిహెచ్ఒ హేమసుందర్, పంచాయతీ కార్యదర్శి స్వామి పాల్గొన్నారు.

ఎస్ రాయవరం : మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ హైస్కూల్‌లో సర్వసిద్ది పిహెచ్‌సి వైద్యాధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని వైస్ ఎంపిపి బొలిశెట్టి గోవిందు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కర్కక దేవి, వైసిపి జిల్లా సెక్రెటరీ కొణతాల శ్రీనివాసరావు, ఎంపిటిసి బైపా శ్రీనివాస్ ఎంపిడిఒ ఎన్.రామచంద్రమూర్తి, తహశీల్దార్ విజయకుమార్, ఎంఇఒ మూర్తి, పంచాయితీ సెక్రటరీ సత్యనారాయణ, వైద్యాధికారులు డాక్టర్ ఎస్-ఎస్‌వి శక్తిప్రియ, డాక్టర్ పి.రాజేశ్వరి, గైనకాలజిస్ట్ డాక్టర్ ఎ.జయలక్ష్మి, ఆర్థోపెడిషియన్ డాక్టర్ ధర్మ తేజ, నేత్రవైద్య నిపుణులు బి.వెంకటరావు పాల్గొన్నారు.

గొలుగొండ : చీడిగుమ్మల జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని జెడ్‌పిటిసి సుర్ల గిరిబాబు ప్రారంభించారు. శిబిరంలో 350 మంది రోగులను చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ జి.సువర్ణ, ఆర్థోపెడిక్ నిపుణులు శ్రీకాంత్, స్థానిక పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ బుద్దా ధనుంజయ్, డాక్టర్ గొర్ల మధుసూధన్ పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో అరబిందో ఎమర్జెన్సీస్ 104 సర్వీసెస్ నర్సీపట్నం డివిజన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ కె.వెంకట అప్పారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం గిడిజాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 500 మందికి పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ప్రత్యేకాధికారి పద్మ, ఎంపిడిఒ అడపా లవరాజు, తహశీల్దార్ లోకవరపు రామారావు, వైసిపి నాయకులు బంక సత్యం, కోరాడ వెంకట్రావు, పాండ్రంకి శ్రీను, బొట్ట రామకృష్ణ, మజ్జి వెంకటరావు, షిణగం అప్పలరాజు, రౌతు వెంకట్రావు పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి 3వ వార్డు అప్పికొండ వీధి సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో 25 మందికి సుగర్ పరీక్షలు, 35 మందికి బిపి, 20 మందికి రక్త పరీక్షలు చేశారు. సచివాలయం కన్వీనర్ ఆర్.దేవి, వైసిపి నాయకులు వై.అచ్చిబాబు, గృహ సారథులు రమేష్, ఆదిలక్ష్మి, ఎఎన్ఎం పైడిరాజు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు పరిధి ఎన్జీజీవోస్ కాలనీలోని యుపిహెచ్‌సి వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పలువురికి వైద్య సిబ్బంది తనిఖీలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనుక్, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్ రాజు, వైసిపి నేతలు పీలా వెంకటలక్ష్మి, పైడి రమణ, జివి.రమణి, బులుసు జగదీష్ పాల్గొన్నారు.

తగరపువలస : భీమిలి మండలం, లక్ష్మీపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు.



ఎస్.రాయవరంలో రోగులకు పరీక్షిస్తున్న వైద్యాధికారి

పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపిపి దంతులూరి వాసురాజు, జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు, వైసిపి నేతలు బోని బంగారు నాయుడు, యలమంచిలి సూర్య నారాయణ, ఎల్. జగదీశ్వర రావు, గాడు శ్రీను, గాడు తాతినాయుడు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని జి.భీమవరంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హేమంత్, ఎమ్‌పిపి కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, తహశీల్దారు గండి సత్యనారాయణ, ఎంపిడిఒ రవి కుమార్, డాక్టర్ రమేష్, సిడిపిఒ ప్రభావతి పాల్గొన్నారు

బుచ్చయ్యపేట : మండలంలో రాజాం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జెడ్‌పిటిసి దొండా రాంబాబు శుక్రవారం సందర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్యారాణి, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో సువర్ణ రాజు, స్థానిక సర్పంచ్ మరిసా నాని పాల్గొన్నారు.

ప్రచార ఆర్భాటమే...

ఫొటోలకు ఫోజులు.. సాదాసీదా వైద్యసేవలు

ప్రజాశక్తి- కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలు ఫొటోలకు ఫోజులకు మాత్రమే పరిమితమై, వైద్యసేవలు నామమాత్రమౌతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో శుక్రవారం పాములవాకలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు హాజరయ్యారు.

విపరీతంగా ప్రచారం చేయడంతో 370మందిదాకా, రోగులు కూడా పెద్ద సంఖ్యలో వచ్చారు. అయితే వైద్యసేవలు సాధారణంగానే ఉన్నాయని శిబిరానికి వచ్చి వారు వాపోతున్నారు. ఆ వైద్యశిబిరంలో జిల్లాస్థాయి అధికారులు ఎవరు హాజరు కాకపోవడం విశేషం, రోగులకు సిబ్బందికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా వైసిపి మండల అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు అన్ని ఏర్పాటు చేశారు, కార్యక్రమంలో పలువురు వైద్యులు ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు, పలువురు వైసిపి నాయకులు, కార్యదర్శి స్వామి నాయుడు పాల్గొన్నారు.



పాములపాక వైద్యశిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాబూరావు

గిరిజన విశ్వవిద్యాలయానికి గాం గంటందొర, మల్లు దొర పేర్లు పెట్టాలి

ప్రజాశక్తి-గొలుగొండ : కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో గిరిజన విశ్వవిద్యాలయాలు ఏర్పాటుకు ఎట్టకేలకు ఆమోదం తెలపడంపై అల్లూరి సీతారామరాజు జాతీయ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో ఏర్పాటు చేసిన గిరిజన విశ్వవిద్యాలయానికి సమ్మక్క, సారక్కల పేర్లు పెట్టడానికి కేంద్రం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడం హర్షనీయమన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసే గిరిజన విశ్వవిద్యాలయానికి స్వాతంత్ర్య సమరయోధులు గాం గంటం దొర, గాం మల్లు దొర పేర్లు పెట్టాలని కేంద్రం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. 1952లో తొలి పార్లమెంటు ఎన్నికల్లో మల్లుదొర విశాఖపట్నం నుండి ఎన్నికయ్యారని, పార్లమెంట్‌లో మల్లుదొర ఉపన్యాసానికి ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ముగ్దులై ప్రశంసించారని గుర్తు చేశారు. గిరిజన విశ్వవిద్యాలయానికి గాం గంటం దొర, మల్లుదొరల పేర్లు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫార్సు చేయాలని వీరభద్రరావు సూచించారు.

ప్రజోపయోగ పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - రావికమతం : ఉపాధిహామీ పథకం పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కవగుంట సర్పంచ్ దాసరిసూర్యకుమారి కోరారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన గ్రామసభకు అధ్యక్షత వహించిన సర్పంచ్ మాట్లాడుతూ 2024-25 ఏడాదికి పనుల గుర్తింపు, ప్రణాళిక రూపకల్పనపై చర్చించారు. గామ అభివృద్ధితోపాటు, జాబ్ కార్డు కలిగిన ఉపాధి కూలీలు వలసబాట పట్టకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. మట్టి రోడ్లు, పంటకాలువలు వంటి ప్రజోపయోగ పనులు చేపట్టాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి స్వామి మాట్లాడుతూ ఈ ఏడాది ఉపాధి నిధులతో రైతుల వ్యక్తిగత పనులను, సామాజిక పనులను,చెరువులు, కాలువలు, మట్టి రోడ్లు, కందకాలు, నీటి గుంటలు మొదలగు పనులను గుర్తించి, పంచాయతీ తీర్మానంతో అంచనా ప్రతిపాదనలను రూపొందించి నివేదిస్తామన్నారు. క్రార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ మోహన్, వార్డు సభ్యులు సిహెచ్. రామనాయుడు, పద్మ, వర కుమారి, నాగేశ్వరరావు, వి చిన్న నాగరాజు, పి రాము పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని కొమరవోలు పంచాయతీ రెవెన్యూలో 66 సర్వే నెంబరులో కొమరవోలు ఆవకు సంబంధించిన ప్రభుత్వ స్థలాన్ని, ఉపాధి హామీ పథకంలో వేసిన గట్టును కొమరవోలు గ్రామానికి చెందిన కన్నూరు నానిబాబు, కన్నూరు అప్పలనాయుడు, కన్నూరు పార్వతి ఆక్రమించుకున్నారని తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు అదే గ్రామానికి చెందిన కన్నూరు శ్రీనివాస్ తెలిపారు. ఆక్రమించి మొక్కలు వేసి, రహదారిని దిగ్బంధం చేసి కంచె వేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.

ఇ-క్రాప్ నమోదు వేగవంతం

ప్రజాశక్తి -పాడేరు : ఇకెవైసి, ఇ క్రాప్ నమోదు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఐటిడిఎప్రాజెక్టు అధికారులు, సబ్ కలెక్టర్లు, తాహశీల్దారులు, వ్యవసాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇక్రాప్ నమోదు, ఇకెవైసి, ఓటరు సవరణ ప్రక్రియ, భూముల రీసర్వే, కులధ్రువీకరణ పత్రాలు జారీపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రైతుకు పిఎం.కిసాన్ లబ్ది చేకూర్చుడమే లక్ష్యంగా వ్యవసాయాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. జిల్లాలో ఇకెవైసి 88 శాతం పూర్తయ్యిందన్నారు. ఈ నెల 13వ తేదీలోగా శతశాతంపూర్తి చేయాలని ఆదేశించారు. ఇ క్రాప్ నమోదులో మరింత పురోగతి సాధించాలని స్పష్టం చేసారు. జి.కె. వీధి, పెదబయలు, అరకు వ్యాలీ మండలాల్లో ఆర్ఓఎఫ్ఆర్ భూముల డిజిటలైజేషన్ వేగంగా పూర్తి చేయాలన్నారు. జగనన్నకు చెబుదాం ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అడ్డతీగల మండలంలో పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్లు వెంటనే పూర్తి చేయాలని తాహశీల్దారును ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా పూర్తి చేసి ముసాయిదా జాబితా తయారీకి సిద్దం కావాలని స్పష్టం చేసారు. రీసర్వే లక్ష్యాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. కులధ్రువీకరణల జారీ మరింత త్వరగా చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె. శివశ్రీనివాసు, పాడేరు, రంపచోడం ఐటిడిఎ పిఒలు వి. అభిషేక్, సూరజ్ గనోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, డిఆర్ఒ పి. అంబేద్కర్, నంద్ పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మాణంపై ఫిర్యాదు



రోడ్డుకు అడ్డంగా నిర్మించిన గోడ

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని17 గ్రామాలకు మంచినీరు అందించేందుకు లింగంపేట పంచాయతీలో నిర్మించిన మంచినీటి ప్రాజెక్టుకు వెళ్ళే రోడ్డుకి అడ్డుగా గోడను నిర్మించారని స్థానిక టిడిపి నేతలు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆలయ పూజారి త్రిమూర్తులు, కాంట్రాక్టర్ కలిసి నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన గోడతో, ప్రతిరోజు ప్రాజెక్ట్ నుంచి నీటివిడుదల, నిర్వహణ పనులకు వెళ్లే ఆర్‌డబ్ల్యూ ఉద్యోగులకు ఆటంకం కలుగుతుందన్నారు. దీనిపై పరిశీలన జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదుపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇసుదర్శన్ స్పందిస్తూ, అధికారులతో విచారణ చేయించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. గొలుగొండ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఇ సుదీర్షను వివరణ కోరగా, తాగునీటి పథకానికి వెళ్లేమార్గంలో సిసిరోడ్డుపై అడ్డంగా గోడ నిర్మించినట్లు తన దృష్టికి వచ్చిందని, పంచాయతీ కార్యదర్శి అప్పారావును విచారణ చేసి గోడను తొలగించాలని సూచించినట్లు తెలిపారు.

వీధి బాలల గుర్తింపునకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి -పాడేరు: గాంధీ జయంతి పురస్కరించుకొని ఈనెల 2 నుంచి ప్రారంభించిన వీధి బాలల గుర్తింపు ప్రక్రియను ఈ నెల 10వరకు నిర్వహించనున్నట్లు సహాయ కార్మికశాఖ అధికారి పి సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఐసిడిఎస్, పోలీసు సిబ్బందితో కలిసి, పాడేరులోని అన్ని డిపార్ట్‌మెంట్ స్టోర్స్‌ను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ, ఎక్కడైనా వీధి బాలలు, అనాధ పిల్లలు కనిపిస్తే ఐసిడిఎస్ సూపర్‌వైజర్,లేదా సహాయ కార్మిక అధికారులకు తెలియపరస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. 14ఏళ్ల నిండని బాలలతో పనిచేయించడం, పనులకు ఉపయోగించడం చట్టరీత్యా నేరమని, బాధ్యులైన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



స్థలాలను పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

దేవాలయాల ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలంలో 8 దేవాలయాలు ఏర్పాటుకు దేవాదాయ శాఖ అధికారులు శుక్రవారం పలుచోట్ల పర్యటించి స్థల పరిశీలన చేశారు. జిల్లా ఎండోమెంట్ సహాయ కమిషనర్ కె.శిరీష, ఇంజినీర్ శ్రీనివాసరావు, బి.వసంతకుమారి, ఎఇ వై.మురళీకృష్ణ కనమాం గ్రామపంచాయతీలో పర్యటించారు.

అరిగి మెరకలో పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం, యర్రవానిపాలెంలో దుర్గాదేవి దేవాలయం, గోరింట, సియాద్రి మెరక సమీపంలో భూలోక మాత దేవాలయం, గోరంటలో పరదేశ మాత దేవాలయం, గొల్లల కణమాంలో రామాలయం, గంభీరం, శొంఠ్యాం, గొంతువానిపాలెంలో దేవాలయాలు మొత్తం ఎనిమిదింటికి రూ.80 లక్షలు మంజూరు చేసినందుకు అధికారులకు, నాయకులకు వైసిపి నాయకులు పినిశెట్టి సింహాచలంనాయుడు, కణమాం సీనియర్ నాయకులు ఎర్ర అప్పలనాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గీతల దేముడు, లెంక రాంబాబు, బొట్టా రామకృష్ణ, కోరాడ వెంకట రమణ, అప్పలరాములు అభినందనలు తెలిపారు.

పలుచోట్ల రైల్వే డిఆర్ఎం తనిఖీలు



శ్రీకాకుళం రోడ్ స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న డిఆర్ఎం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ శుక్రవారం విశాఖపట్నం - శ్రీకాకుళం సెక్షన్‌లోని దూసి నుంచి విశాఖపట్నం వరకు విండో ట్రైలింగ్ ద్వారా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యాలు, ఇతర అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ తనిఖీల్లో భాగంగా డిఆర్ఎం శ్రీకాకుళం స్టేషన్, కాలనీ పక్కనే ఉన్న ప్రాంతాలను, మూడో లైన్ ఆగ్మెంటేషన్ ప్రాజెక్ట్ కింద ప్రయాణికుల సౌకర్యాలను, ఇతర ప్రణాళికలను పరిశీలించారు. ఆయన వెంట ఎడిఆర్ఎం (ఇన్‌ఫ్రా) సుధీర్ కుమార్ గుప్తా, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్ కుమార్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ (కో-ఆర్డినేషన్) ఎకె మోహరణ, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ (తూర్పు) ఎంవి.రమణ, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఎంఎస్ఎన్.మూర్తి ఉన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపిపి, ఇతర నేతలు

ప్రజాశక్తి - రావికమతం : మండలంలోని గర్నికం పంచాయతీ శివారు కానాడ రోడ్డు పనులను ఎంపిపి పైలరాజు ఆధ్వర్యంలో మండల నాయకులు శుక్రవారం పరిశీలించారు. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు దుస్థితిపై గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి ఎంపి సత్యవతి, తన ఎమ్మెల్యే కోటా నిధులను ఇస్తామన్న హామీ మేరకు నిధులు మంజూరు చేయగా, పనులు చురుగ్గా సాగుతున్నాయి. మేడివాడ నుంచి కానాడకు వెళ్లే రోడ్డు పనులను మండల నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. నాణ్యతతో పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు కార్యక్రమంలో గర్నికం సర్పంచు నూకరాజు, మండల కన్వీనర్ కె. జగన్నాధరావు, మండల మాజీ ఉపాధ్యక్షులు గంటా ఈశ్వరరావు, మాణిక్యం, సత్తిబాబు, గణేష్ , రమణబాబు పాల్గొన్నారు.

అనకాపల్లి ఎంపీ సీటు విజయ్‌కు కేటాయించాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్‌కు అనకాపల్లి పార్లమెంట్ స్థానం టిక్కెట్ కేటాయించాలని తెలుగు యువత మండల అధ్యక్షుడు శెట్టి లోవ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు చింతకాయల అయ్యన్నపాత్రుడి తనయుడిగానే ఆయన అడుగుజాడల్లో పార్టీకి విధేయుడిగా నడుస్తూ, యువతకు స్ఫూర్తిదాయకమైన సేవలు అందిస్తున్నారని, సీనియర్లు, జూనియర్లు, అన్నివర్గాల ప్రజలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగే సత్తా విజయ్‌కు ఉందన్నారు. యువగళం పాదయాత్రలో లోకేష్ అడుగులో అడుగేసుకుంటూ ముందుకు సాగిన విజయ్, యువతకు స్ఫూర్తిగా నిలిచారన్నారు.విజయ్‌కు అనకాపల్లి ఎంపీ స్థానాన్ని కేటాయించారని వార్తలు వస్తున్న నేపథ్యంలో హర్షం వ్యక్తం చేస్తూ, అదే జరిగితే అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో టిడిపి విజయానికి ఢోకా ఉండదన్నారు.

916వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు



దీక్షా శిబిరంలో నినాదాలు ఆటో కార్మికులు

ప్రజాశక్తి - కలెక్టరేట్(విశాఖ) : ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను మోడీ ప్రభుత్వం నిలుపుదల చేయాలని విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను విరమించాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి 916వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు ఆటో యూనియన్ కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. ఉక్కు నిర్వాసితులందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ భూములను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించాలనే ప్రతిపాదనను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు జి.అప్పలరాజు, కెవి.రమణ, జి.ప్రకాష్, శేషుబాబు, వరప్రసాద్, నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా యుటిఎఫ్ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు క్యాంపెయిన్‌లో యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-గొలుగొండ : యూటీఎఫ్ సభ్యత్వ క్యాంపెయిన్‌లో భాగంగా శుక్రవారర మండలంలో'' పలు హైస్కూల్స్‌ను యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో సందర్శించారు. విద్యా వ్యవస్థలో జరుగుతున్న అనేక విషయాల మీద ఉపాధ్యాయులతో చర్చిస్తూ సభ్యత్వ క్యాంపెయిన్ కొనసాగింది. ముఖ్యంగా సిపిఎస్ రద్దు చేస్తానని గద్దెనెక్కిన ప్రభుత్వం రద్దు చేయకపోగా, జిపిఎస్ అనే గుదిబండను ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాల మీద మోపిందని ఆరోపించారు. ఉపాధ్యాయులు ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో ఉత్తేజితులై, ఢిల్లీ రైతు ఉద్యమం తరహాలో పోరాడేందుకు ముందుకు రావాలన్నారు. అధ్యయనం,అధ్యాపనం సామాజిక స్పృహలో భాగంగా సమాజంలో జరుగుతున్న అన్ని విషయాలను కూలంకషంగా అధ్యయనం చేసి సమాజాన్ని చైతన్యం చేయడమే యుటిఎఫ్ నినాదమన్నారుఅనంతరం స్వాతంత్ర్య సమర యోధులు అల్లూరి సీతారామరాజు సమాధిని సందర్శించి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు గాయత్రి, మండల అధ్యక్షులు కోడి రాజబాబు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు చిట్టియ్య, శోభన్, చిట్ల అప్పారావు స్వర్జన్‌రాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు శ్రీ ప్రకాష్ విద్యార్థులు



రాష్ట్రపోటీలకు ఎంపికైన శ్రీప్రకాష్ విద్యార్థులు

ప్రజాశక్తి- పాయకరావుపేట : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో,విశాఖపట్నం పోర్ట్ స్టేడియంలో ఈనెల 4న నిర్వహించిన అండర్ -19 బాస్కెట్ బాల్ బాలుర, బాలికల జట్టు ఎంపిక పోటీలలో శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బాలుర జిల్లా జట్టుకు బి.క్రాంతి, బాలికల జట్టుకు పి. శ్రీనిధి, కెవివి. లక్ష్మీ ప్రసన్న, ఆర్. శ్రీ రమావర్షిత ఎంపికయ్యారు. వీరు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో విశాఖ జిల్లా జట్టు తరపున పాల్గొంటారని శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వివిఎస్ఎస్. భానుమూర్తి తెలిపారు. బాస్కెట్‌బాట్ పోటీల్లో ప్రతిభచూపిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సిహెచ్‌వికె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, ఇన్‌ఛార్జి శ్రీలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయులు బాలరాజు, దుర్గబాబు అభినందించారు.

అర్హులకు సంక్షేమ లబ్ధి చేకూర్చడమే లక్ష్యం



సంక్షేమ లబ్ధి పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి-నక్కపల్లి : అర్హులకు సంక్షేమ లబ్ధి చేకూర్చడమే లక్ష్యమనిఎమ్మెల్యే గొల్ల బాబురావు అన్నారు శుక్రవారం .నక్కపల్లిలో మూడవరోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వీవర్స్ కాలనీలోపర్యటించారు. సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. లబ్ధిదారులకు బ్రోచర్లను పంపిణీ చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని కృషి చేస్తాననిహామీ ఇచ్చారు. జగన్ పాలనలో ప్రతి కుటుంబానికి వారి గడప ముంగిటకే సంక్షేమ లబ్ధి చేరవేస్తున్నామన్నారుఈ సందర్భంగా పలువురు.ఇళ్ల స్థలాలు, ఇళ్లమంజూరు చేయాలని, డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి రత్నం, సర్పంచ్ జయరత్నకుమారి, వైస్ ఎంపిపి నానాజీ , పార్టీ మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, మాజీ ఎంపిపి బొల్లం బాబ్జి, ఉప సర్పంచ్ రాజు, పార్టీ నాయకులు శేషారత్నం, లోడగల చంద్రరావు, నల్లల రామకృష్ణ పాల్గొన్నారు .

గిరిజన ప్రాంతాలపై ఏదీ చిత్తశుద్ధి?

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్‌కు లేటరైట్‌పై ఉన్న శ్రద్ధ, నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాలైన నాతవరం మండలం సరుగుడు, సుందరకోట, అసనగిరి గ్రామాల అభివృద్ధిపై ఏమాత్రం శ్రద్ధ లేదని జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజాన వీరసూర్యచంద్ర తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ సరుగుడు, సుందరకోట గ్రామాలను సందర్శించి, అక్కడ గిరిజనులతో మమేకమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లేటరైట్ అనుమతులకు బినామీల పేరుతో రెండు ఫైళ్లను ఎమ్మెల్యే వేశారని ఆరోపించారు. అసనగిరికు వెళ్లేందుకు కనీసం రోడ్డు లేదని, స్కూల్ భవనం,అంగన్వాడీ సెంటర్లు, లేవని కలుషిత నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు

. సుందరకోట పంచాయతీ పరిధిలోని ఎనిమిది గ్రామాలకు స్కూల్ భవనాలు లేవన్నారు. దేవాలయంలో పాఠశాల నిర్వహిస్తున్నారన్నారు. ఫ్లోరైడ్ సమస్య తీవ్రంగా ఉందన్నారు నర్సీపట్నంలో మినీ ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. గడచిన నాలుగున్నరేళ్లుగా హడావిడి తప్ప ఎటువంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. కార్యక్రమంలో వెలగల వెంకటరమణ, బైన మురళీ, మాకిరెడ్డి వెంకటరమణ, అసనగిరి నూకరాజు, సుందరకోట నూకరాజు ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థినులకు మెమోంటోలు అందజేస్తున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి-గొలుగొండ : విద్యార్థినులు చదువుతో పాటు ఆటలలో కూడా రాణించాలని గొలుగొండ కస్తూర్బా గురుకుల బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ సుధ అన్నారు. ఇటీవల జిల్లా స్థాయి ఆటల పోటీలలో రాణించిన విద్యార్థినులకు శుక్రవారం మెమొంటోలను అందజేసి అభినందించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, నిజ జీవితంలో క్రీడా స్ఫూర్తిని చూపించాలని విద్యార్థినులకు ప్రిన్సిపాల్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైసిపికి పెంకుల రాజు రాజీనామా



మాట్లాడుతున్న పెంకుల రాజు

ప్రజాశక్తి- నక్కపల్లి : వైసిపి క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ఆ పార్టీ సీనియర్ నేత చిలువూరి రామసూర్యనారాయణ రాజు (పెంకుల రాజు) వెల్లడించారు. శుక్రవారం నక్కపల్లిలో తన స్వగృహంలో విలేకర్లతో మాట్లాడుతూ, 2013లో ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విపక్షనేతగా పాదయాత్రకు తుని వచ్చినప్పుడు, ఆయన కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారన్నారు. అయితే ప్రస్తుతం కష్టించి పనిచేస్తున్న తనకు పార్టీలో సరైన గుర్తింపు లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు..ఇటువంటి పరిస్థితిలో పార్టీలో కొనసాగడం అనవసరమని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.తన రాజీనామాను పార్టీ జిల్లా అధ్యక్షునికి పంపిస్తానన్నారు.తన వెంట నడిచిన అనుచరులకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రేయోభిలాషులు, అనుచరులతో చర్చించి దసరాకు భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానన్నారు. కాగా పెంకులరాజు గతంలో కాంగ్రెస్ హయాంలో డిసిసి కార్యదర్శి వంటిపలు పార్టీ పదవులు చేపట్టడంతోపాటు, ఉపమాక వెంకన్న ఆలయ పాలకమండలి చైర్మన్‌గా వ్యవహరించారు.